క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ , గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లుకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్వేలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ అనురాధ

ఆలూరు రూరల్: సచివాలయ సిబ్బంది తమకు అప్పగించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌డీఓ అనురాధ సూచించారు. శుక్రవారం పట్టణంలోని సచివాలయం -2,4ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీఏపీఎస్, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ ఎన్‌రోల్‌మెంట్, నాన్ రెసిడెంట్ ఆఫ్ ఏపీ, ఎంఎస్‌ఎం ఈ సర్వేలు పూర్తి చేయాలన్నారు. అలాగే బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ఇంటింటి సర్వేలు ఈ నెల 18వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ మహబూబ్ బాషా ఉన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ



భూమి చేస్తున్న గ్రామస్తులు

మద్దికెర: మండల పరిధిలోని మదనంతపురం గ్రామంలో మహనీయుడు వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు గ్రామస్తులు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. అందరి సహకారంతో సకాలంలో పనులు పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ట చేయనున్నట్లు వారు తెలిపారు.

వీఆర్వోకు ఎస్‌ఏగా పదోన్నతి



వెంకటరాముడు

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగుల వీఆర్వో వెంకటరాముడుకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్ ఇచ్చారు. కలెక్టర్ రంజిత్‌బాషా ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పదోన్నతి పొందిన వెంకటరాముడుకు పత్తికొండ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న కానిస్టేబుల్ హంపయ్య

పత్తికొండ రూరల్: స్థానిక డీఎస్పీ కార్యాలయ కానిస్టేబుల్ హంపయ్య శుక్రవారం ఆపదలో ఉన్న మహిళకు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు. కర్నూలు అమీలియో హాస్పిటల్‌లో కిడ్నీ సంబంధిత ఇన్ఫెక్షన్‌తో చికిత్స పొందుతున్న గుర్రమ్మకు బి పాజిటివ్ రక్తం అత్యవసరమైంది. పత్తికొండ సీఐ జయన్న ద్వారా విషయం తెలుసుకున్న హంపయ్య కర్నూలు హాస్పిటల్‌కు వెళ్లి రక్తదానం చేయడంతో డీఎస్పీ వెంకట్రామయ్య అభినందించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

తుగ్గలి: మండల పరిధిలోని రాతనకొత్తూరు సమీపంలో కొలువైన సుంకులమ్మ అమ్మవారిని శుక్రవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ దర్శించుకున్నారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

పథకాల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆర్డీఓ సమీక్ష



సమీక్షిస్తున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

వెల్దుర్తి: మండలంలో రెవెన్యూ పథకాల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ సమీక్షించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకున్న ఆర్డీఓ ఇక్కడి తహసీల్దార్ సెలవులో ఉండడంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సాయంత్రం వరకు విధులు నిర్వహించారు. తహసీల్దార్ కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామంటూ హామీ ఇచ్చారు. సాయంత్రం కార్యాలయం అధికార, సిబ్బందితో సమావేశమై అంశాలపై చర్చించారు. డీటీ గురుస్వామి రెడ్డి, మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.

వీరబ్రహ్మంగారి జాతర చూతము రారండి..!

- నేటి నుంచి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు
- రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



పత్తికొండలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం



స్వామి వారి మూలవిరాట్

పత్తికొండ రూరల్/తుగ్గలి: కాలజ్ఞాన తత్వాలతో ప్రజలకు జీవిత పరమార్థాన్ని, భవిష్యత్తును ప్రబోధించిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కలియుగ దేవుడిగా ప్రజల చేత నిత్యపూజలందుకుంటూ కీర్తించబడుతున్నారు. పత్తికొండలోని పాతపేటలో కొలువైన బ్రహ్మంగారి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పత్తికొండ పట్టణంలో వెలసిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమై, 23న ముగుస్తాయని ఆలయ ధర్మకర్త పాటిల్ ఎల్లారెడ్డి, నిర్వాహకులు తెలిపారు. 17న సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. జిల్లాలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలు, జాతరలు నిర్వహించడం చాలా అరుదు. పట్టణంలో 70 ఏళ్లకు పైగా స్వామి వారి రథోత్సవాన్ని భక్తులు పట్టణవాసులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దేవాలయానికి ఎలాంటి స్థిర, చర ఆస్తులు లేకున్నప్పటికీ భక్తుల విరాళాలతోనే పూజా కార్యక్రమాలతో పాటు, ఏటా రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

నాటి ఊరేగింపు– నేటి రథోత్సవం

ఆలయం నిర్మించిన తర్వాత ఏటా స్వామి వారి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించే రోజునే అప్పటి పెద్దలు రథోత్సవం నిర్వహించాలని నిశ్చయించారు. నూతనంగా తయారు చేయించి 1947 నుంచి రథోత్సవం నిర్వహించడం ప్రారంభించారు. ఏటా మాఘమాసం పౌర్ణమి తర్వాత మూడవ రోజు నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కాలక్రమంలో రథం శిథిలమవడంతో భక్తుల విరాళాలతో 1991లో రాతి చక్రాలతో నూతన రథాన్ని చేయించారు. పట్టణంలోని ఈ ప్రాంతంలో స్వామి తేరు (రథోత్సవం) నిర్వహిస్తుండటం వల్ల నాటి నుంచి ఈప్రాంతాన్ని తేరుబజారుగా పిలుస్తారు. వడ్ల శరభయ్య వారసులు బ్రహ్మంగారి దేవాలయ పూజారులుగా వ్యవహరిస్తున్నారు.

పూజల వివరాలు

15న ఉదయం 8 గంటలకు గణేశారాధన, ఆచార్యాది రుత్విగ్వరణం, కలశస్థాపన, వాస్తు పూజ, నిత్యజప హోమం, బలిహరణం, సాయంత్రం 6గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణం, 16న ఉదయం 11.05నిమిషాలకు అభిజిత్ లగ్న శుభపుష్కరాంశమందు స్వామి వారి కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటల నుంచి ప్రభోత్సవం, 17న ఉదయం 9 గంటలకు పంచకలశ స్థాపన, బ్రహ్మరథాంగ హోమం, బలిహరణం, మధ్యాహ్నం 11–45గంటలకు బ్రహ్మరథం, సాయంత్రం 4గంటలకు రథోత్సవం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 18న పార్వేట, నంది ఉత్సవం, 19న వేదాంతోపన్యాసం, మధ్యాహ్నం భక్తాదులకు అన్నదానం, 23న ఆదివారం ఉదయం వసంతోత్సవంతో వేడుకలు ముగియనున్నాయన్నారు.

ఆలయ నిర్మాణం..



ఆలయ నిర్మాణ దాత దాసిరెడ్డి(ఫైల్)

దాసిరెడ్డికి పత్తికొండలో బ్రహ్మంగారి ఆలయం నిర్మించాలనే సంకల్పం కలిగింది. ఈ విషయాన్ని భక్తులతో పంచుకున్నారు. ముఖ్య శిష్యుడైన శరభయ్య తన పశువుల కొట్టం ఉన్న స్థలాన్ని ఆలయ నిర్మాణానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఆ వెంటనే పశువుల కొట్టాన్ని శుభ్రం చేసి అందులో స్వామి చిత్ర పటాన్ని ఉంచి పూజలు చేయసాగారు. అప్పటి నుంచి ఏటా మాఘమాసంలో బ్రహ్మంగారి చిత్రపటాన్ని తోపుడుబండిపై ఉంచి ఊరేగింపు నిర్వహించేవారు. ఈనేపథ్యంలో దాసిరెడ్డి హాలహర్వికి వెళ్లి అక్కడే కన్నుమూశారు. ఆలయం నిర్మించాలనే గురువు కోరిక మేరకు ఆయన శిష్యులు శరభయ్య, నరసింహారెడ్డి, కొండ నరసయ్య, జిన్ను సుబ్బరాయుడు, బర్బా నాగప్ప, లక్ష్మీనరసయ్య విరాళాలు సేకరించి 1945లో పశువుల కొట్టాన్ని తొలగించి ఆలయం నిర్మించారు.

నాటి పశువుల కొట్టమే..నేటి బ్రహ్మంగారి ఆలయం

ఆలూరు నియోజకవర్గం హాలహర్వి గ్రామానికి చెందిన దాసిరెడ్డి అనే భూస్వామి తన జీవితంపై విరక్తి చెంది భార్యకు తెలియకుండా దేశాటనకు బయలుదేరాడు. పలు ప్రాంతాలు తిరుగుతూ చివరికి బ్రహ్మంగారి మఠానికి చేరుకున్నారు. ఆలయ సన్నిధిలో కొన్నేళ్లు అక్కడే గడిపాడు. అక్కడ బ్రహ్మంగారి జ్ఞాన తత్వాలు, బోధనలతో స్వామి వారి భక్తుడిగా మారారు. వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ బ్రహ్మంగారి తత్వాలు, బోధనలు ప్రజలకు వివరిస్తూ గుంతకల్లుకు చేరుకున్నారు. అదే సమయంలో పత్తికొండకు చెందిన వడ్ల శరభయ్య దాసిరెడ్డికి ముఖ్య శిష్యుడయ్యారు.

వేడుకగా గంధోత్సవం

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో శుక్రవారం దస్తగిరిస్వామి ఉరుసు ప్రారంభమైంది. ఆలయ నిర్వాహకులు దస్తగిరి స్వామి గుర్రాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాలో గంధం సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా ఉరుసు సందర్భంగా శనివారం ములుగుందం గ్రామానికి ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు తెలిపారు. దర్గాలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు చెప్పారు.

నేటి నుంచి సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం

తుగ్గలి: మండలంలో శనివారం నుంచి సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 62 పీడబ్ల్యూఎస్, 26 ఎంపీడబ్ల్యూఎస్, 14 డైరెక్ట్ పంపింగ్ స్కీంలు ఉన్నాయని, 152 చేతి పంపులుగా ఉండగా వాటిలో 66 పనిచేస్తున్నాయన్నారు. సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా నేటి నుంచి గ్రామాల్లో ఉన్న తాగునీటి చేతి బోర్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో తాగునీటి తలెత్తకుండా ఉండేందుకు రూ.48 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. తాగునీటి సమస్య తీవ్రమైన చోట ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తామన్నారు.

వాహనాల తనిఖీ

పత్తికొండ రూరల్: స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో శుక్రవారం ఎస్‌ఐ గోపాల్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన రికార్డులను పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



తొట్టిలో నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

దేవనకొండ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెర్నెకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రంగస్వామి అన్నారు. మండలంలోని గుమ్మరాళ్ల గ్రామంలో శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామంలో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్లల్లో ఎక్కువ కాలం నీటిని నిల్వ ఉంచుకోరాదన్నారు. నీటితొట్టెలు, డ్రమ్ముల్లో నీరు ఎక్కువ కాలం ఉంచుకుంటే దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలబారిన పడే అవకాశం ఉందన్నారు. అలాగే రాత్రివేళ దోమ తెరలను వాడాలన్నారు. గ్రామంలో ఎన్‌సీడీ సర్వే నిర్వహించినట్లు చెప్పారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి



ఏపీడీ పక్కీరప్పకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

దేవనకొండ: పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు చాకలి కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు సి.బజారి, వై.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల సమితి ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యలపై ఏపీడీ పక్కీరప్ప, ఏపీఓ రాజునాయక్‌లకు వినతి పత్రం అందించారు. ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని దుయ్యబట్టారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించకపోవడం వల్ల ఉపాధి కూలీలు పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

కంటి చూపుపై జాగ్రత్తగా ఉండాలి



తుగ్గలి కేజీబీవీలో విద్యార్థినులకు కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తుగ్గలి: కంటి చూపుపై విద్యార్థినులు జాగ్రత్త వహించాలని వైద్యాధికారిణి ప్రతిమ, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి సూచించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ అందించిన కళ్ల అద్దాలను శుక్రవారం స్థానిక కేజీబీవీ, రాతన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఇటీవల అప్తాలిక్ అసిస్టెంట్ విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న వారికి కళ్ల అద్దాలు అవసరమని గుర్తించారు. ఆ మేరకు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. కంటి చూపుపై నిర్లక్ష్యం చేయొద్దని జాగ్రత్తలు పాటించాలని విద్యార్థినులకు సూచించారు. ఆహారంలో కోడిగుడ్డు, పాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాలయం ఇన్‌చార్జ్ ఎస్‌వో కవిత, వైద్య సిబ్బంది సరస్వతి, వెంకటరామయ్య, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



దేవనకొండ: సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సచివాలయ సిబ్బంది

దేవనకొండ: స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మహేష్, ఇనయతుల్లా, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్, టీడీపీ నాయకులు మస్తాన్, మురళి, షేకన్న, వెంకీ పాల్గొన్నారు.

–ఆస్పరి: మండల కేంద్రం ఆస్పరిలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్మికుల కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని గుర్తుచేశారు. కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భరత్, హరి, రంగస్వామి, దినేష్ పాల్గొన్నారు.

మీటర్ రీడర్స్‌ను ఆదుకోవాలి



మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

ఆలూరు రూరల్: విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉపాధి కల్పించి ఆదుకోవాలని విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు వేదవ్యాస ముని అన్నారు. ఈ నెల 20వ తేదీ విజయవాడలో నిర్వహించనున్న మీటర్ రీడర్స్ యూనిన్ మహాసభల పోస్టర్లను శుక్రవారం స్థానిక డీఈఈ కార్యాలయం ఎదుట ఆవిష్కరించారు. స్మార్ట్ మీటర్స్ రాకతో మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సంస్థలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని తెలిపారు. విజయవాడలో నిర్వహించే మీటర్ రీడర్స్ యూనియన్ ప్రథమ మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. ఆ సంఘం సబ్ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున స్వామి, ఉపాధ్యక్షుడు చరణ్, కార్యదర్శి అబ్దుల్ గని, సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ప్రజలతో మాట్లాడుతున్న నోడల్ అధికారి రఘు

దేవనకొండ: ప్రజలు మంచి ఆరోగ్యం కోసం తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. శుక్రవారం దేవనకొండ ఎస్సీ కాలనీలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ప్రజల్లో మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమలేకపోవడం వంటి కారణాలతో రక్తపోటు, షుగర్, కేన్సర్.. మద్యం, పొగాకు అలవాట్లతో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న సర్వే వేగవంతం చేయాలని సామాజిక ఆరోగ్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. కేన్సర్ లక్షణాలు ముందుగానే గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందిస్తే వ్యాధి నివారణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయభాస్కర్, మంజుభార్గవి పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ బాధ్యతల స్వీకరణ

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదే మండలంలో పోతుగల్లు వీఆర్వోగా విధులు నిర్వహిస్తుండటంతో పదోన్నతిపై తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే చిట్యాల-2 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న మద్దిలేటి పదోన్నతి పొంది కర్నూలులోని స్పెషల్ కలెక్టర్ శ్రీశైలం ప్రాజెక్టు కార్యాలయాకి బదిలీపై వెళ్లినట్లు ఆయన తెలిపారు.

ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య

కృష్ణగిరి: మండలంలో భూమి ఉన్న ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని పోతుగల్లు, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుందన్నారు. దీని వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు.

పెండింగ్‌లో వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆస్పరి: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని రైతు సంఘం నాయకులు విరుపాక్షి, అంజినయ్య, బడేసాహెబ్, శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గీతావాణికి వినతి పత్రం అందజేశారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు ఏడు వారాలు వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివశంకర్

హాలహర్వి: భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శివశంకర్ అన్నారు. శుక్రవారం రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశమయ్యారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ)ని ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందిస్తోందని తెలిపారు. ఈ కార్డు కలిగిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పథకాలు, రాయితీలు, పెట్టుబడిసాయం, పంటలబీమా, కనీస మద్దతు ధర, పంట రుణాలు ప్రయోజనాలు అందుతాయని తెలిపారు.

జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి: స్థానిక ఏపీజీబీ బ్యాంకు ఆవరణలో అనధికారంగా మీసేవ, సీహెచ్‌సీ సెంటర్ నిర్వహిస్తూ, గత ప్రభుత్వ లోగోలతో ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తూ, ప్రజలను, రైతులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణ, ప్రతినిధులు రాజు, చిన్నమాదులు శుక్రవారం ఆర్డీఓ సందీప్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. మండలంలో అక్రమంగా మైనింగ్ నిర్వహణ, వంకలు వాగుల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రీసర్వే పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బి.నవ్య

పత్తికొండ రూరల్: రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పత్తికొండ ఆర్డీఓ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రీసర్వేపై వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ముందస్తు నోటీసు ఇవ్వకుండా మ్యూటేషన్ చేయరాదని తహసీల్దారులను ఆదేశించారు. ఏమైనా సందేహాలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం స్థానిక సివిల్ సప్లయి కేంద్రాన్ని తనిఖీ చేసి స్టాక్ రిజిస్టరు పరిశీలించారు. ఈమె వెంట ఆర్డీఓ భరత్‌నాయక్ ఉన్నారు.

బాట మారెమ్మకు కుంభోత్సవం





మారెమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విరూపాక్షి, సర్పంచ్, పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే

హాలహర్వి: మండలంలోని విరుపాపురం గ్రామ సమీపంలో వెలసిన బాట మారెమ్మదేవికి విరుపాపురం సర్పంచ్ మూక సిద్ధమ్మ కుంభోత్సవం నిర్వహించారు. ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గ ప్రజలందరూ చల్లగా ఉండాలని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. కుంభోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి హర్ధగేరి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామరెడ్డి, మండల కో-కన్వీనర్ మల్లికార్జున, మండల యూత్ అధ్యక్షుడు గంగాధర, ఎంపీటీసీ గాదిలింగ, సర్పంచ్ మంజుల, నాయకులు మల్లి, హులప్ప, అయ్యాలి, హులిగప్ప తదితరులు పాల్గొన్నారు.

పూల్వామా అమర జవాన్లకు నివాళులు



హాలహర్వి: అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఆలూరు: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

హాలహర్వి: 2019 ఫిబ్రవరి 14వ తేదీ ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 40 మంది వీర జవాన్ల సేవలను స్మరిస్తూ శుక్రవారం సాయంత్రం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో నివాళులు అర్పించారు. వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉషోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ ఉపాధ్యాయులు కె.అయ్యనగౌడ్, కేర్ టేకర్ భంగి రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

ఆలూరు: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆలూరు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, గోపాల్ అన్నారు. శుక్రవారం ఆలూరులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి అమర సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగులు రామచంద్ర, బసవరాజ్, శ్రీనివాస గౌడు, రంగస్వామి, శ్రీనివాసులు, రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకుడు గోవిందప్ప, ఆర్యవైశ్య, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు సుబ్బయ్య, పాండు రంగప్ప ,శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు 6,976 దరఖాస్తులు

తుగ్గలి: సొంత స్థలం కలిగి ఉండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఇళ్లు నిర్మించుకోవడానికి 6,976 దరఖాస్తులు వచ్చినట్లు హౌసింగ్ డీఈ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి అర్బన్ కింద రూ.2.50 లక్షలు, గ్రామీణ కింద రూ.1.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇళ్ల మంజూరు కోసం ఇప్పటి వరకు తుగ్గలి మండలంలో 2,190 దరఖాస్తులు, మద్దికెరలో 647, పత్తికొండలో 508, వెల్దుర్తిలో 1,698, కృష్ణగిరి మండలంలో 1,663 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లులు వెంటనే చెల్లిస్తామన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న డీఈఓ



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

వెల్దుర్తి: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం చంద్రావతి, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డీఈఓ శామ్యూల్, ఎంఈఓ ఇందిర, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న మాదిగ, ఈఓ లక్ష్మీనాథ్, పారిశ్రామిక వేత్త సాయిప్రసాద్, బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ శైలజ, పీడీ నిర్మల, టీడీపీ నాయకులు బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, సుధాకర్ గౌడ్, బజయ్య హాజరయ్యారు. పీఎమ్‌శ్రీ కింద నిర్మించిన కబడ్డీ కోర్టును ప్రారంభించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.